అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో నార్సింగి పూర్వ విద్యార్థులు

మణికొండ: వారంతా 35 ఏళ్ల క్రితం ఒకే తరగతి గదిలో కలిసి చదువుకున్నారు. తిరిగి అంతా కలిసి పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవటంతో పాటు మిత్రుల స్థితిగతులను అడిగి తెలుసుకోవాలనుకున్నారు. మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించి రోజంతా హుషారుగా గడిపారు. నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989–90 విద్యా సంవత్సరంలో వారు పదో తరగతి ఉత్తీర్ణులయ్యారు. నార్సింగిలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వారికి విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు సత్యనారాయణ, సీతాబాయిలను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కోకాపేట మాజీ ఉపసర్పంచ్ యాదగిరి, కోకాపేట మాజీ ఎంపీటీసీ అలివేలు మంగ, నార్సింగి మాజీ వార్డు సభ్యుడు వినోద్‌కుమార్‌తో వారి మిత్రులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



రజని

శంషాబాద్ రూరల్: ఇంటి వద్ద నుంచి యువతి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడ గ్రామానికి చెందిన బక్క శంకరయ్య కూతురు రజని(26) ఈ నెల 25న ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం అన్ని చోట్ల వెతికినా జాడ తెలియలేదు. మంగళవారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

రాయదుర్గం: జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని జర్నలిస్ట్ కాలనీలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. మంగళవారం జవహర్ బాలమంచ్ ఆధ్వర్యంలో రంగారెడ్డిజిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి అభిషేక్‌గౌడ్ ఆధ్వర్యంలో సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శశాంక్‌రావు, సంఘమేష్, దేవేందర్‌రెడ్డి, సందీప్ ముదిరాజ్, కిరణ్, అమాన్, సుభానీ, నవీన్, ఎజాజ్ పాల్గొన్నారు.

బోనాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



అమ్మవారికి పూజలు చేస్తున్న చంటిబాబు తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు అన్నారు. మంగళవారం ఆయన కోటపై ఉన్న మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం తరపున అన్ని శాఖల అధికారులను కలిసి ఏర్పాట్లపై చర్చిస్తున్నామన్నారు. అదే విధంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి వసంత సూచనల మేరకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి బి.సురేష్ చారి, నిర్వహణ కమిటీ సభ్యులు ఎస్.శ్రీకాంత్, బి.అనిత తదితరులున్నారు.

రాష్ట్రం గర్వపడేలా కోట బోనాలు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలను రాష్ట్రం గర్వించేలా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని టోలిచౌకీ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. మంగళవారం పీస్ కమిటీ సభ్యులు, గోల్కొండ కోట బోనాల ఉత్సవ నిర్వహణ కమిటీ చైర్మన్, సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం కోట బోనాలకు ప్రపంచ గుర్తింపు లభించిందన్నారు. బోనాల ఉత్సవాలు జరిగే రోజుల్లో కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ వారు అందిస్తున్న సహకారం వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, డీఐ రాజేందర్‌ప్రసాద్, బోనాల నిర్వహణ కమిటీ చైర్మన్ చంటిబాబు, ఎస్.శ్రీకాంత్, ఆబేద్, ఎలియాస్ అలీ, అనిత ఉన్నారు.



. అసంపూర్తిగా పనులు చేపట్టి వదిలేయడంతో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

రోడ్లు వేస్తారు.. తవ్వేస్తారు..

- గుంతలమయంగా మారుతున్న రోడ్లు
- నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృథా
- అధికారుల వ్యవహారంపై స్థానికుల ఆగ్రహం

అత్తాపూర్: ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేయకపోవడంతో చేసిన పని మళ్లీ మళ్లీ చేపడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రైన్ కనెక్షన్, తాగునీటి వ్యవస్థను ఆధునీకరించకుండానే రోడ్డు నిర్మాణం చేపట్టడం కారణంగా స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సీసీ రోడ్ల నిర్మాణం క్యూరింగ్ పనులు పూర్తి కాకుండానే తాగునీటి పైపుల నిర్మాణం కోసం ఒకరు డ్రైనేజీ పైపులైన్ మరమ్మతుల కోసం మరొకరు ఏదో ఒక చోట సర్కిల్ పరిధిలో రోడ్ల తవ్వకాలు జరుపుతున్నారు. దీనికి తోడు శాశ్వత పనులు చేపట్టకపోడంతో పాటు తాత్కాలిక పనులు అంటూ రోడ్లపై ప్యాచ్‌వర్క్‌లు చేస్తున్నారు. అత్తాపూర్, హైదర్‌గూడ జనప్రియ తదితర ప్రాంతాల్లో వాహనాదారులు పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హైదర్‌గూడ 16 షెటర్ల చౌరస్తా నుంచి ఉప్పర్‌పల్లిలో ఉన్న రాజేంద్రనగర్ 8వ మెట్రోపాలిటన్ కోర్టుకు వెళ్లే రహదారిలో సీసీ రోడ్డు వేయడానికి రెండు నెలల సమయాన్ని తీసుకున్నారు. కాంట్రాక్టర్లు ప్రస్తుతం ఈ రోడ్డు మార్గంలో సైడ్ సీసీ రోడ్డును తవ్విపడేశారు. దీంతో మున్నాళ్ల ముచ్చటగానే మారిందని స్థానికులు జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారుల వ్యవహార శైలిపై మండిపడుతున్నారు.



ఉప్పర్‌పల్లికి వెళ్లే మార్గంలో రోడ్డు కట్టింగ్

డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలి



గ్రామ పంచాయతీ మున్సిపాలిటీలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ, కచ్చా మోరీలను తలపిస్తోంది. 50 సంవత్సరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలి. తాగునీటి పైపులైన్ ఏర్పాటు, అండర్ గ్రౌండ్ ఎలక్ట్రీసిటీ ఏర్పాటుకు ప్లాన్ చేయాలి. ఆ తర్వాత సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టాలి. రోడ్డు కట్టింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– అప్పారెడ్డి ముఖేష్, అత్తాపూర్.

ప్రజల్లో జవాబుదారితనం రావాలి



మహానగర అభివృద్ధికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీ ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతోంది. సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వకుండా ఎవరికి వారు రోడ్డు కట్టింగ్ చేయడం, గుట్టుగా వారి పనులు చేసుకుంటున్నారు. ప్రజల్లో జవాబుదారితనం రావాలి. ప్రజా సంబంధించిన ఆస్తులను కాపాడుకోవాలి. ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి. స్వార్థ ప్రయోజనాలను వీడి పట్టణ అభివృద్ధికి భాగస్వాములు కావాలి.

– నరేందర్‌గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, రాజేంద్రనగర్



చైతన్య విల్లాస్‌లో రోడ్డును తవ్వి ప్యాచ్‌వర్క్ పనులు చేసిన దృశ్యం

అక్రమ నిర్మాణాలకు చెక్ పెట్టాలి

- బీఆర్ఎస్ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు సీతారాం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయని, అధికారులు నామమాత్రంగా ఒకటి, అరా కూల్చివేతలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని బీఆర్ఎస్ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. పార్టీ నాయకులతో కలిసి గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నంబర్–19లో పర్యటించిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో తీసుకున్న అనుమతులకు భిన్నంగా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఎలాంటి సెట్ బ్యాక్ లేకపోవడం, ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం, అదనపు అంతస్తులు వేయడం వంటివి అన్ని కాలనీల్లో కొనసాగుతున్నాయన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన ఉన్న చెత్త చెదారాన్ని వెంటనే తొలగించాలని, వర్షాకాలంలో రోగాలను నివారించాలన్నారు. డ్రైనేజీలను క్లీన్ చేయడం, వర్షాకాలం రాకముందే ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలన్నారు. వీధి కుక్కలకు షెల్టర్ నిర్మించి వాటి ఇబ్బందిని ప్రజలకు దూరం చేయాలన్నారు. జీహెచ్‌ఎంసీకి భిన్నంగా ఆస్తిపన్నును ఇష్టారాజ్యంగా పెంచి మున్సిపాలిటీల వారు వసూలు చేస్తున్నారని, వాటిని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.ధన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, ఉపాధ్యక్షుడు బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్, భానుచందర్, సుమనళిని, బి.శ్రీధర్, రాజేంద్రప్రసాద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటున్నాం

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్



లక్ష్మీగూడలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: అన్నివర్గాల ప్రజలకు అండగా ఉంటూ వారికి ఎలాంటి సమస్యలు రాకుండా ప్రత్యేక దృష్టిసారించడం జరుగుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ, రాజీవ్‌గృహకల్ప, ఓల్డ్ కర్నూల్ రోడ్ తదితర ప్రాంతాల్లో ఆయన జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్నామన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్, జలమండలి జీఎం లక్ష్మీ, రేణుక, డివిజన్ అధ్యక్షుడు ఎస్.ధనుంజయ్, టి.ప్రేమ్‌గౌడ్, అర్జున్, సరికొండ వెంకటేష్, జీవన్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, లావణ్య, రాధారెడ్డి, శరణమ్మ, పుష్ప, అనిత, మానస, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కోసం రైతుల ఆందోళన



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: భారతీయ వరి పరిశోధన సంస్థ(ఐసీఏఆర్) ఎదుట విత్తనాల కోసం మంగళవారం రైతులు ఆందోళన చెప్పాట్టారు. ముందు చెప్పిన ప్రకారం విత్తనాలు పంపిణీ చేయాలని అధికారులతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి 2 కిలోల విత్తనాలను పంపిణీ చేసి పంపించారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం ఐసీఏఆర్ ద్వారా విత్తన మేళాలో మంగళవారం పంపిణీ చేస్తామని అధికారులు ముందుగా ప్రకటన చేశారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల రైతులు పెద్ద ఎత్తున రాజేంద్రనగర్‌లోని భారతీయ వరి పరిశోధన సంస్థ దగ్గరకు చేరుకున్నారు. స్టాక్ లేదని అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు రైతులకు నచ్చజెప్పి పంపించారు. త్వరలో విత్తన మేళా ఏర్పాటు చేస్తామని చెప్పి ఒక్కో రైతుకు రెండు కిలోల చొప్పున ఇచ్చి పంపించారు.

బీసీ కులాల అభ్యున్నతే 'మాస్' లక్ష్యం



సమావేశమైన మాస్ ప్రతినిధులు

శంషాబాద్: బీసీ కులాల అభ్యున్నతి కోసం వారిని చైతన్య పరిచే దిశగా 'మన ఆలోచన సాధన సమితి' (మాస్) కృషి చేస్తోందని వక్తలు పేర్కొన్నారు. బీసీ కులాల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు నెల రోజులుగా వివిధ నియోజకవర్గాల్లో గ్రామబాట నిర్వహించిన మాస్ ప్రతినిధులు మంగళవారం శంషాబాద్‌లోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో సమావేశం అయ్యారు. బీసీలు రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారత సాధించేలా కార్యక్రమాలు రూపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంతంగి విఠలయ్యాగౌడ్, సంస్థ వ్యవస్థాపకులు కటకం నర్సింగ్‌రావు, గడ్డం నర్సింహాగౌడ్, సభ్యులు చేవెళ్ల ప్రసాద్, చెన్నయ్య, సిద్దులు, రామేశ్వరయ్య, మనోజ్‌ముదిరాజ్, ధన్‌రాజ్, అశోక్, బాలమల్లేష్, గణేష్, నర్సింహులు, దేవేందర్, వెంకటేష్‌యాదవ్, మల్లిఖార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

అధిక రసాయన ఎరువులతో నేల కాలుష్యం



చిన్నగోల్కొండలో నిర్వహించిన కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రైతులు

శంషాబాద్ రూరల్: పంటలకు అధిక మోతాదులో రసాయన ఎరువుల వాడకంతో నేలతో పాటు వాతావరణం కాలుష్యం అవుతుందని వ్యవసాయ విశ్వవిద్యాలయం భూసార విభాగ శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజమణి తెలిపారు. మండలంలోని చిన్నగోల్కొండలో మంగళవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాగులో రసాయన ఎరువుల మోతాదును తగ్గించి, పంటలకు సేంద్రీయ ఎరువులు వాడుకోవాలన్నారు. స్థానికంగా రైతులు సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న, కూరగాయల సాగులో అధిక దిగుబడుల పొందడంతో పాటు నాణ్యమైన పంట వచ్చేందుకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి ఆర్.శ్వేత, ఏఈఓ రాఘవేందర్‌గౌడ్, రీసెర్చ్ అసోసియేట్ పి.సోనియా, పీజీ విద్యార్థినులు అక్షయ్, మనీష, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన హకీంపేట్‌లో షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అర్హులైన నిరుపేదల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. దీనికి తోడుగా నిరుపేదల వైద్యం కోసం సీఎం సహాయ నిధి పథకం నుంచి కూడా ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆరూస్ ఫరాన్, వజీఉజ్జమా సిద్దిఖీ, ఆలీముద్దీన్ తదితరులున్నారు.

దుర్గానగర్ నుంచి ఆరాంఘర్‌కు రాకపోకలు షురూ



దుర్గానగర్ మీదుగా ఆరాంఘర్‌కు వెళ్తున్న వాహనాలు

మైలార్‌దేవ్‌పల్లి: దుర్గానగర్ నుంచి ఆరాంఘర్ వైపు మూసివేసిన రహదారిని ట్రాఫిక్ పోలీసులు పునప్రారంభించారు. రోడ్డు పనుల కారణంగా 19వ తేదీ నుంచి ఈ దారిలో వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వలేదు. దీంతో దుర్గానగర్ మీదుగా కాటేదాన్ వైపు వెళ్లి వాహనాలు ఆరాంఘర్‌కు వచ్చేవి. ట్రాఫిక్ సమస్య అధికంగా ఉండి వాహనాదారులు తీవ్ర అవస్థలకు గురయ్యారన్నారు. 15 రోజుల పాటు జరగాల్సిన పనులను వేగవంతంగా పూర్తి చేసి వాహనాల రాకపోకలను ప్రారంభించారు.

నేటి నుంచి సబ్ జూనియర్ రోయింగ్ చాంపియన్ షిప్

సాక్షి, సిటీబ్యూరో: హుస్సేన్ సాగర్‌లో 26వ సబ్ జూనియర్ జాతీయ రోయింగ్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అండర్–13, 15లో బాలురు, బాలికల విభాగాల్లో 23 రాష్ట్రాల నుంచి దాదాపు 350 మంది పాల్గొంటారని తెలిపారు. 'తెలంగాణ జరూర్ ఆనా' అనే నినాదంతో క్రీడల టూరిజాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగానే ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యమిస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి కొండా సురేఖ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రోయింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మిథున్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

కోట బోనాలకు సహకరిస్తాం

గోల్కొండ: గోల్కొండ కోటలో జరిగే జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాఢ బోనాల ఏర్పాటుకు అన్ని రకాలుగా సహకరిస్తామని గోల్కొండ కోట సీనియర్ పరిరక్షణ అధికారి మల్లేశం అన్నారు. కోట బోనాల ఉత్సవ కమిటీ ప్రతినిధులు మంగళవారం ఆయనను కోటలోని కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ కె.చంటిబాబు ఆయనను శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు లోబడి బోనాల నిర్వహణకు అన్ని రకాలుగా సహకరిస్తామన్నారు. అంతేకాకుండా బోనాలు జరిగే రోజుల్లో కోటలో భక్తులకు ఉచిత ప్రవేశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.శ్రీకాంత్, సురేష్‌గౌడ్ తదితరులున్నారు.

కబ్జా ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు



గ్రీన్ సిటీలోని ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని గ్రీన్ సిటీ ప్రాంతాన్ని మంగళవారం ఉదయం జీహెచ్‌ఎంసీ విజిలెన్స్ అధికారులతో పాటు సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులు సందర్శించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో రాజేంద్రనగర్‌కు చెందిన శివ అనే వ్యక్తి పార్కు స్థలాన్ని ఆక్రమించి ఐదు అంతస్తుల భారీ నిర్మాణాన్ని చేపడుతున్నారంటూ ఫిర్యాదు చేశాడు. దీంతో ఉదయం విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, విజిలెన్స్ ఎస్సై మోహన్, రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్, ఏఈ రోహిత్ తదితరులు భవన నిర్మాణ ప్రదేశానికి చేరుకున్నారు. భవన నిర్మాణ పరిస్థితిని పరిశీలించడంతో పాటు దస్తావేజులను పరిశీలించారు. ఫిర్యాదుదారుడు అందజేసిన పత్రాలతో పాటు ఇంటి యజమాని నుంచి పత్రాలను స్వీకరించి పరిశీలించారు. అనంతరం పలు పత్రాల విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.

పొంచిఉన్న ప్రమాదం

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న శాస్త్రిపురం కాలనీవాసులు

శాస్త్రిపురం: విద్యుత్ తీగలు వణుకు పుట్టిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌లోని చాలా ప్రాంతాల్లో విద్యుత్ తీగలను తీగజాతి మొక్కలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారాయి. ఈదురుగాలులు వీచినప్పుడు తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటోంది. స్పందించాల్సిన విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో నిత్యం పలుమార్లు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికే స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం స్పందించడం లేదు. ఇదే దుస్థితి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కూడా ఉండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రానున్న వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని శాస్త్రిపురం కాలనీల ప్రజలు కోరుతున్నారు.





తుర్కియే రెస్టారెంట్లను బ్యాన్ చేయాలి



బీజేపీ నాయకుల సమావేశంలో దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: నగరంలో తుర్కియే పేరుతో ఉన్న రెస్టారెంట్లు, మందీలను వెంటనే నిషేధించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. తుర్కియే దేశానికి చెందిన మందీలు, తుర్కియో రెస్టారెంట్ల నిషేధంపై మంగళవారం దేవర శ్రీనివాస్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్ ప్రేరేపిత స్థావరాలను భారత్ ధ్వంసం చేసిందని అయితే ఈ క్రమంలో తుర్కియే పాకిస్తాన్‌కు మద్దతుదారుగా ఉంటూ సైనిక సహాయాన్ని సైతం చేసిందన్నారు. శత్రు దేశానికి అండగా నిలుస్తున్న వారు నిర్వహించే ఇటువంటి రెస్టారెంట్లను ప్రభుత్వం వెంటనే బ్యాన్ చేయాలని, లేదంటే తాము వాటికి వ్యతిరేకంగా ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆవుల సత్యనారాయణ, సతీష్ కురుమ, శ్రీనాథ్, న్యాయవాది వంశీ, రాంగోపాల్, దేవర చంద్రశేఖర్ తదితరులున్నారు.

నేడు వినాయక్ దామోదర్ సావర్కర్ జయంతి

గోల్కొండ: స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్ 142వ జయంతి వేడుకలను బుధవారం నిర్వహిస్తున్నామని కార్వాన్ వీర్ సావర్కర్ అసోసియేషన్ ప్రతినిధి జొన్నకుంటి మధుసూదన్ అన్నారు. మంగళవారం ఆయన పలువురు బీజేపీ నాయకులను కలిసి జయంతి వేడుకలకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు.